క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా ఆదివారం విద్యుత్ సరాఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీనివాస్‌రావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ఇబ్రహీంపట్నం టౌన్, చర్లపటేల్‌గూడ, కర్ణంగూడ, మంచాల రోడ్డు, ఖానాపూర్‌లో విద్యుత్ సరాఫరా నిలిపివేస్తున్నట్లు చెప్పారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

మాడ్గుల: మండల పరిధిలోని ఆర్కపల్లిలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు సర్పంచ్ ఏర్పుల జంగయ్య శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని ఓనస్ హస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ వైద్య శిబిరంలో డయాబెటిస్, బీపీ, వెన్నెముక, కీళ్లు, మోకాళ్ల నొప్పులకు సంబంధించి ఉచితంగా పరీక్షలు చేస్తారని వివరించారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ సూచించారు.

నేడు పుష్పయాగం

ఆమనగల్లు: పట్టణంలోని వేంకటగిరి వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం పుష్పయాగం, లక్ష పుష్పార్చన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఆలయంలో 21రోజులుగా ధనుర్మాస ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. పుష్పయాగం, లక్ష పుష్పార్చన కోసం ఆలయ ధర్మకర్త కృష్ణమాచార్యుల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు.

రేపు 'కంటి వెలుగు'పై సమావేశం

ఆమనగల్లు: పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఈనెల 9న మధ్యాహ్నం 2గంటలకు కంటి వెలుగు కార్యక్రమంపై ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఫారూక్ హుస్సేన్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 18 నుంచి రెండో విడత కంటి వెలుగు కార్యక్రమం ప్రారంభించనున్న నేపథ్యంలో అధికారులు, ప్రజాప్రతినిధులకు అవగాహన కల్పించేందుకు ఈ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు.

ఎంపీడీఓ కార్యాలయంలో..

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10.30గంటలకు కంటి వెలుగుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ జయరాం విజయ్ తెలిపారు. ఎంపీపీ కృపేశ్ అధ్యక్షతన నిర్వహించే ఈ కార్యక్రమానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

ఆర్థికసాయం అందజేత

మాడ్గుల: మండల పరిధిలోని గుడితండాలో అనారోగ్యంతో బాధపడుతూ శనివారం తెల్లవారుజామున వద్యా వాలి మృతిచెందాడు. దీంతో వారి కుటుంబ సభ్యులకు కొల్కులపల్లి సర్పంచ్, ఎంపీటీసీ సభ్యుడు భట్టు అనురాధ, భట్టు కిషన్‌రెడ్డి ఆర్థికసాయం అందజేశారు. వాలి మృతదేహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం వాలి కుమారుడు స్థానిక వార్డు సభ్యుడు తిరుపతిని పరామర్శించి రూ.3వేల ఆర్థికసాయం అందజేశారు. పరామర్శించిన వారిలో కాంగ్రెస్ నాయకులు సురేశ్‌నాయక్, తదితరులు ఉన్నారు.

వైభవంగా ధనుర్మాసోత్సవం



ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు

తలకొండపల్లి: మండల పరిధిలోని దేవుని పడకల్ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ ఉత్సవాలకు హైదరాబాద్, శంషాబాద్, షాద్‌నగర్, అచ్చంపేట్, తదితర పట్టణాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చా రు. ఉత్సవ నిర్వాహకులు భక్తులకు ఇబ్బంది లేకుండా సదుపాయాలు కల్పించారు. శనివారం పల్లకీ సేవ, ఆలయ ప్రదక్షిణలు, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సర్పంచ్ శ్రీశైలం, ఉప సర్పంచ్ తిరుపతి, ఈఓ మోహన్‌రావు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శంకర్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు రవి, రైతు సంఘం నాయకులు కృష్ణగౌడ్, ఆంజనేయులు, నరహరి, పెంటయ్య, సత్యం, మోహన్‌రెడ్డి, రాజు, జంగయ్య, రవి, గణేశ్, నర్సింహ పాల్గొన్నారు.

కమాన్ ప్రారంభం



మైత్రి కుటీర్ కమాన్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మంచిరెడ్డి, ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్: పెద్ద అంబర్‌పేట మున్సిపాలిటీ 23వ వార్డులోని రూ.5లక్షల వ్యయంతో మైత్రి కుటీర్ కాలనీ వాసులు కాలనీ ముఖ ద్వారాన్ని నిర్మించుకున్నారు. ఈ కమాన్‌ను శనివారం ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి, ఎమ్మెల్సీ నర్సిరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ స్వప్న, కౌన్సిలర్ కృష్ణారెడ్డి, లక్ష్మారెడ్డిపాలెం కాలనీ అధ్యక్షుడు గోవింద్‌రెడ్డి, మైత్రీకుటీర్ అధ్యక్షుడు బాబురావు, ప్రధాన కార్యదర్శి మాజీద్ బాబా, కార్యదర్శి శివగౌడ్, కాలనీ వాసులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

'కాంకర్డ్ డ్రగ్స్' మూసివేయాలి

ఆదేశాలు జారీచేసిన పీసీబీ



కంపెనీలో నిల్వ ఉంచిన శుద్ధి చేయని వ్యర్థాలు

తుర్కయంజాల్: కాలుష్య నియంత్రణ మండలి నిబంధనలకు విరుద్ధంగా బ్రాహ్మణపల్లిలో కొనసాగుతున్న కాంకర్డ్ డ్రగ్స్ లిమిటెడ్ కంపెనీకి క్లోజర్ ఆర్డర్స్ జారీ చేస్తూ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి జోనల్ కార్యాలయం జాయింట్ చీఫ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ ఉత్తర్వులు జారీచేశారు. ఈ నెల 4న బ్రాహ్మణపల్లికి చెందిన కె.నర్సింహారెడ్డి పొలం సమీపంలో ఓ డీసీఎంలో శుద్ధి చేయని వ్యర్థాలను డంప్ చేస్తుండగా స్థానికులు పట్టుకుని మున్సిపల్ అధికారులు, పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వీరి బాగోతం బయటపడిన విషయం విదితమే. దీంతో ఫిర్యాదు స్వీకరించిన పీసీబీ విచారణ చేపట్టగా విస్తుపోయే వాస్తవాలు వెలుగుచూశాయి. కన్సెంట్ ఫర్ ఆపరేషన్ అనుమతిని లేకుండానే పరిశ్రమ నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. 2016 డిసెంబర్ 1న సీఎఫ్ఓ తీసుకోగా 2021 ఆగస్టు 31తో గడువు ముగిసింది. ఇప్పటికీ రెన్యూవల్ చేసుకోలేదు. ఈ కంపెనీ నుంచి వెలువడే రసాయన వ్యర్థాలను శుద్ధి చేయడానికి మల్లాపూర్‌లోని ఎంఎస్. ఇంద్వా టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి తరలించాలి. కానీ ఏడాదీ కాలంగా కంపెనీ నిర్వాహకులు ఆ పని చేయడం లేదు. సీఈటీపీ శుద్ధి జలాలనే బయట వదలాల్సింది పోయి నేరుగా సమీప పొలాలు, రోడ్లుకు ఇరువైపులా చెరువులు, కుంటల్లో వదలుతున్నట్లు గుర్తించారు. ఈ కారణాలను చూపిస్తూ క్లోజర్ ఆర్డర్ ఉత్తర్వులను జారీచేస్తున్నట్లు పేర్కొన్నారు.

పట్టించుకోని కాలుష్య నియంత్రణ మండలి

ఏడాది సీఎఫ్ఓ లేకుండానే పెద్ద ఎత్తున కాంకర్డ్ డ్రగ్స్ కంపెనీ నిర్వాహకులు ఉత్పత్తి చేపడుతూ వ్యర్థాలను బయటకు వదలుతున్న కాలుష్య నియంత్రణ మండలి అధికారులు పట్టించుకోలేందటే వీరి పనితీరుకు అద్దం పడుతోంది. ఈ కంపెనీ నుంచి వచ్చే కాలుష్యంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నా ఎవరూ స్పందించలేదు. చివరకు స్థానికులు ధైర్యం చేసి వ్యర్థాలను వదులుతుండగా పట్టుకోవడంతో రెన్యూవల్ చేసుకోకుండానే కంపెనీ నడిపిస్తున్నట్లు బయటపడింది. సీఈటీపీ రసాయన వ్యర్థాలను తరలించాలంటే సీఎఫ్ఓ తప్పనిసరి. 16 నెలలుగా అనుమతి లేకుండానే కొనసాగుతోంది. ఈ కంపెనీ నుంచి వెలువడే వ్యర్థాలు బయటకే వదిలారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

విద్యుత్ సరఫరా నిలిపివేత

కాంకర్డ్ డ్రగ్స్ కంపెనీకి తక్షణమే విద్యుత్ సరఫరా నిలిపివేయాలని సెక్షన్ 41(2), యాక్ట్ 1988 ప్రకారం పీసీబీ ఆదేశాలను జారీచేసింది. ఒక వేళ డీజిల్ జనరేటర్‌లు, ఇతర ప్రత్యామ్నాయ మార్గాలతో యంత్రాలను నడిపేందుకు యత్నించినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

గొర్రెల మందపై కుక్కల దాడి

30 జీవాలు మృత్యువాత



మృత్యువాత పడిన గొర్రె పిల్లలు

మాడ్గుల: మండల పరిధిలోని అవురుపల్లిలో గొర్రెల మందపై కుక్కలు దాడి చేయడంతో 30 జీవాలు మృత్యువాత పడ్డాయి. వివరాల ప్రకారం గ్రామానికి చెందిన గొర్రెల కాపరి చెన్నయ్య వ్యవసాయ పొలం వద్ద గొర్రెల షెడ్ ఏర్పాటు చేసుకున్నాడు. రోజు మాదిరిగానే శుక్రవారం చిన్న గొర్రె పిల్లలను షెడ్‌లో ఉంచి జీవాలను మేతకు తీసుకెళ్లాడు. సాయంత్రం వచ్చి చూడగా కుక్కల దాడిలో 22 గొర్రె పిల్లలు మృత్యువాత పడగా.. మరో ఎనిమిది పిల్లలు ప్రాణపాయ స్థితిలో ఉన్నాయి. వాటికి చికిత్స అందించినప్పటికీ శనివారం మృతిచెందాయి. రూ.1.20లక్షల వరకు నష్టం వాటిల్లిందని ప్రభుత్వమే ఆదుకోవాలని చెన్నయ్య కన్నీటి పర్యంతమయ్యాడు. ఇప్పటికైనా గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అవకతవకలపై విచారణ చేపట్టండి

పోలీసు రిక్రూట్‌మెంట్‌పై ప్రభుత్వానికి విద్యార్థి యువజన సంఘాల వినతి

ఇబ్రహీంపట్నం రూరల్: పోలీస్ రిక్రూట్‌మెంట్‌లో జరిగిన అవకతవకలపై ప్రభుత్వం విచారణ చేపట్టాలని విద్యార్థి, యువజన సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా శనివారం ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ తిరుపతిరావుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శంకర్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి క్రాంతి, లక్ష్మణ చారి మాట్లాడుతూ .. ఇటీవల పోలీస్‌రిక్రూట్‌మెంట్ బోర్డులో అనేక అవకతవకలు జరిగాయని ఆరోపించారు. అభ్యర్థులు ఎన్నో ఇబ్బందులు పడ్డారన్నారు. ప్రశ్న పత్రాల్లోనూ తప్పులు దొర్లాయన్నారు. ఈ వెంట్స్ ఏ దేశంలో లేని విధంగా మన రాష్ట్రంలో నిర్వహించడం సరికాదన్నారు. రన్నింగ్‌లో అర్హత పొందిన అభ్యర్థులకు మెయిన్స్‌లో అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రిలిమ్స్ ప్రాథమిక పరీక్షలో తప్పుగా వచ్చిన 7 ప్రశ్నలకు మార్కులు కలపాలని డిమాండ్ చేశారు. లేదంటే ప్రగతి భవన్ ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి వంశి, అరుణ్, ఉపేందర్, భానుప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ చైర్మన్‌కు సన్మానం



చంద్రయ్యను సన్మానిస్తున్న చిత్తాపూర్ గ్రామస్తులు

మంచాల: మండల పరిధిలోని చిత్తాపూర్ గ్రామానికి చెందిన ఏర్పుల చంద్రయ్య ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు ఆయనకు శనివారం చిత్తాపూర్‌లో సర్పంచ్ బొడ్డు నాగరాజ్‌గౌడ్ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చంద్రయ్య మాట్లాడుతూ.. ప్రజల కోసం పనిచేసేవారికి బీఆర్‌ఎస్‌లో గుర్తింపు ఉంటుందన్నారు. ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి సహకారంతో 25ఏళ్లుగా రాజకీయాల్లో ఉంటూ ప్రజా సేవ చేశానని ఈ సందర్భంగా గుర్తు చేశారు. తన శ్రమను గుర్తించి మార్కెట్ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలను అప్పగించడం గర్వంగా ఉందన్నారు. అనంతరం ఎమ్మెల్యే కిషన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సత్తయ్య, ఉపసర్పంచ్ రేణుక, నాయకులు సత్తయ్య, పెద్దులు, శ్రీను, మల్లేశ్, కృష్ణ, స్వామి, మహేందర్, సుధాకర్, కిషన్, శివ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయండి



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి భగవంత్‌రాజ్

తలకొండపల్లి: టీఎస్ యూటీఎఫ్ 5వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి భగవంత్‌రాజ్ అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో శనివారం తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భగవంత్‌రాజ్ మాట్లాడుతూ ఈ నెల 13, 14 తేదీల్లో హైదరాబాద్‌లోని మన్నెగూడ సమీపంలోని బీఎంఆర్ సార్థ ఫంక్షన్ హాల్‌లో రాష్ట్ర మహాసభలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతున్నారని చెప్పారు. ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున హాజరై మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండలాధ్యక్షుడు ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి సురేశ్, శ్రీనివాసులు, రవి, విజయ, మాధవి, మూర్తి, మహేశ్, కబీర్ పాల్గొన్నారు.

'ఐక్యత' ఆధ్వర్యంలో అంబులెన్స్ సేవలు



అంబులెన్స్ సర్వీసులు ప్రారంభిస్తున్న రాఘవేందర్

ఆమనగల్లు: పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో రోగులకోసం శనివారం ఉచిత అంబులెన్స్ సేవలను ప్రారంభించారు. ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల మండలాల ప్రజలకు అత్యవసర సమయంలో అంబులెన్స్ సేవలను ఉచితంగా అందించడానికి ఐక్యత ఫౌండేషన్ ఆమనగల్లు ప్రభుత్వాసుపత్రి వద్ద అంబులెన్స్‌లను ఏర్పాటు చేసింది. ఆసుపత్రి ఆవరణలో ఈ సేవలను ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వాసుపత్రి వైద్యాధికారి డా.పరిక్షిత్, ఎంపీహెచ్ఈఓ తిరుపతిరెడ్డి, సర్పంచ్‌లు శ్రీను, వెంకటమ్మ, అనురాధ, స్వప్న, మాజీ సర్పంచ్ శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాలకు అతీతంగా ప్రజాసేవ

ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి



మంచాల: సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి

మంచాల: రాజకీయాలకు అతీతంగా పేదలందరికీ సేవ చేస్తున్నామని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బాధితులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు. మండల పరిధిలోని జాపాల గ్రామానికి చెందిన మంతని మల్లేశ్‌కు రూ.60వేలు, ఎల్లమ్మ తండాకు చెందిన సభావట్ బద్దునాయక్‌కు రూ.20వేల చొప్పున మంజూరైన చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. గ్రామాల అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాలకు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలి

అరహులంతా ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలని బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి బహదూర్ అన్నారు. శనివారం మండల పరిధిలోని చెన్నారెడ్డిగూడ గ్రామానికి చెందిన కొల్లోజు బ్రహ్మచారికి సీఎంఆర్ఎఫ్ కింద రూ.30వేలు మంజూరయ్యాయి. దీంతో శనివారం ఆయన వారి కుటుంబ సభ్యులకు చెక్కు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు కాత్రోత్‌వరంగా, బీఆర్‌ఎస్ మండల ఉపాధ్యక్షుడు వెంకటేశ్, స్థానిక నాయకులు గోపాల్, శంకర్, సరోజ, శ్రీశైలం, అనిల్‌కుమార్, జంగయ్య, మధు, సందీప్, కిషన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణపల్లి బాధితులకు

తుర్కయంజాల్: మున్సిపల్ పరిధిలోని బ్రాహ్మణపల్లికి చెందిన ఎడ్ల కమలమ్మ, గొరిగె శ్రీను, అచ్చిని జయమ్మ, కమాటి భాగ్యలక్ష్మికి శనివారం క్యాంపు కార్యాలయంలో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు శ్రీనివాస్, సంపతీశ్వర్ రెడ్డి, రవీందర్‌గౌడ్, అయ్యప్పరెడ్డి, ఐలయ్య, వి.మోహన్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, లింగం తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్‌తో పేదలకు మేలు

ఇబ్రహీంపట్నం: సీఎంఆర్ఎఫ్‌తో పేదలకు మేలు చేకూరుతుందని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన క్యాంపు కార్యాలయంలో తొర్రూర్‌కు చెందిన పద్మకు రూ.37 వేలు, రాజుకు రూ.36 వేలు, మల్లమ్మకు రూ.23వేలు, ఎల్లయ్యకు రూ.19 వేల విలువైన చెక్కులు అందజేశారు.

అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

ఎంపీపీ సుకన్య



మాట్లాడుతున్న ఎంపీపీ సుకన్య

ఇబ్రహీంపట్నం: సమన్వయంతో మండలంలోని అభివృద్ధి పనులను పూర్తి చేయాలని ఎంపీపీ సుకన్య అధికారులకు కోరారు. ఎంపీపీ సుకన్య అధ్యక్షతన శనివారం యాచారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండలానికి వచ్చిన నిధుల నిరుపయోగం కాకుండా చూడాలన్నారు. విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని పలువురు సభ్యులు కోరారు. స్పందించిన ఏఈ సందీప్ త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. గొర్రెలు, మేకల నట్టల నివారణ మందులను వచ్చే నెల నుంచి వేయనున్నట్లు పశు వైద్యాధికారి కిరణ్ తెలిపారు. ప్రతీ నెల 3వ శనివారం తల్లిదండ్రుల సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు మండల విద్యాధికారి వెంకట్‌రెడ్డి చెప్పారు. విద్యార్థులు పురోగతిపై తల్లిదండ్రులకు తెలిపి వారి సలహాలను తీసుకుంటామన్నారు. ఆయా గ్రామాల్లో అంగన్‌వాడీ భవనాలకు మరమ్మతులు చేపట్టాలని సభ్యులు కోరారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు జంగమ్మ, ఎంపీడీఓ విజయలక్ష్మి, తహసీల్దార్ సుచరిత, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

డబుల్ ఇంజిన్ సర్కారే లక్ష్యం

కార్యకర్తల సమ్మేళనంలో మాజీ మంత్రి దేవయ్య



ఆమనగల్లు: బండిసంజయ్ ప్రసంగం వింటున్న బీజేపీ నాయకులు



ఇబ్రహీంపట్నం: మాట్లాడుతున్న దేవయ్య

ఇబ్రహీంపట్నం రూరల్: దేశంలో, రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కార్ ఏర్పాటే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలని మాజీ మంత్రి సుద్దాల దేవయ్య సూచించారు. శనివారం ఆదిబట్ల మున్సిపాలిటీలోని బొంగ్లూర్ సమీపంలో క్లాసిక్ జంగారెడ్డి కన్వెన్షన్ హాల్‌లో బీజేపీ బూత్ కార్యకర్తల సమ్మేళనం నిర్వహించారు. ముందుగా నడ్డా ప్రసంగం వినిపించారు. అనంతరం ముఖ్య అతిథులుగా విచ్చేసిన మాజీ మంత్రి సుద్దాల దేవయ్య మాట్లాడుతూ.. ప్రతీ కార్యకర్త సైనికుడిలా పని చేయాలన్నారు. ఈ ప్రాంతంలో టీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆగడాలు ఎక్కువయ్యాయన్నారు. కేసీఆర్ కుటుంబ పాలనకు చరమగీతం పాడాలన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రభారి అరుణ్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి అర్జున్‌రెడ్డి, ఆదిబట్ల ఫ్లోర్ లీడర్ రాములు, అసెంబ్లీ కన్వీనర్ యాదిరెడ్డి, శ్రీశైలం, నారాయణ యాదవ్, సత్యనారాయణ, పాపయ్యగౌడ్, రవీందర్, గోవర్ధన్, రమేశ్, రాంరెడ్డి, దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

విజయం కోసం కృషి చేయాలి

ఆమనగల్లు: రాష్ట్రంలో బీజేపీ విజయం కోసం ప్రతీ నాయకుడు, కార్యకర్త కృషి చేయాలని కల్వకుర్తి అసెంబ్లీ నియోజక వర్గ బీజేపీ పాలక్, మాజీ ఎమ్మెల్సీ రామచంద్రారావు, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి పిలుపునిచ్చారు. పట్టణంలోని ఎస్ఎస్ఎస్ ఫంక్షన్ హాలులో శనివారం కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గం వద్ద బీజేపీ బూత్ కార్యకర్తల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీనడ్డా, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు బండిసంజయ్‌ల సందేశాలను తిలకించారు. అనంతరం రాంచందర్ రావు, ఆచారి మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై ప్రజలు తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారని అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కేసీఆర్ విఫలమయ్యారని ఆరోపించారు. వచ్చే ఎన్నికలలో కేసీఆర్‌కు బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌కు బీజేపీయే ప్రత్యామ్నాయం అని చెప్పారు. ఈ కార్యక్రమంలో జాతీయ ఎస్సీ కమిషన్ మాజీ సభ్యుడు రాములు, కల్వకుర్తి బీజేపీ ఇన్‌చార్జి శేఖర్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కండె హరిప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఫ్రెషర్స్ డే

అబ్దుల్లాపూర్‌మెట్: మండల పరిధిలోని పిగ్లీపూర్ గ్రామంలో ఉన్న అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం ఫ్రెషర్స్ డే నిర్వహించారు. అన్నమాచార్య విద్యాసంస్థల చైర్మన్ చొప్పా గంగిరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రమశిక్షణ, పట్టుదలతో విద్యను అభ్యసించి తల్లిదండ్రులు, విద్యాసంస్థకు, దేశానికి మంచి పేరును తీసుకురావాలన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ పీవీ కృష్ణమూర్తి మాట్లాడుతూ విద్యార్థులు ర్యాగింగ్‌కు దూరంగా ఉంటూ ఉత్తమ పౌరులుగా ముందుకు సాగాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో హెచ్ఓడీ కిరణ్‌కుమార్ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన